
సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 14 । అక్టోబర్ । 2024



దసరా వైభవం

దసరా ఉత్సవాలు వైభవంగా జరిగాయి. దేవీ శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా రథోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహించారు. 8లో



నియమాల తోరణం

జంగారెడ్డిగూడెం మండలం గురవాయి గూడెంలోని అయ్యప్ప క్షేత్రంలో ఏటా వందలాది మంది అయ్యప్ప భక్తులు ఇరుముడులు సమర్పిస్తున్నారు. 8లో



ప్రాణాలకు తెగించి..

ఓ యువకుడు ప్రాణాలకు తెగించి కాలువలో కొట్టుకుపోతున్న ఇద్దరు వ్యక్తులను కాపాడిన సంఘటన వెంకట్రాయపురంలో చోటుచేసుకుంది. 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి ట్రిపుల్‌ఐటీల్లో తరగతులు



నూజివీడు : రాష్ట్రంలో ఆర్జీయూకేటీ పరిధిలో నడుస్తున్న నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో తరగతులు సోమవారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి. దసరా నేపథ్యంలో ఈనెల 6వ తేదీ నుంచి 13 వరకు సెలవులు ఇవ్వడంతో విద్యార్థులంతా ఇళ్లకు వెళ్లారు. ఆదివారంతో సెలవులు పూర్తవ్వడంతో విద్యార్థులు నూజివీడు ట్రిపుల్‌ఐటీకి చేరుకుంటున్నారు. సెలవులు పూర్తవడంతో అధికారులు మెస్‌లను సిద్ధం చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీలకు డీఎస్సీ శిక్షణ

భీమవరం : జిల్లాలో పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి ఆదివారం ప్రకటనలో తెలిపారు. రెసిడెన్షియల్ ప్రాతిపదికన శిక్షణ ఉంటుందని, టెట్‌లో ఉత్తీర్ణులైన వారికి స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి 85 శాతం, టెట్‌లో పొందిన మార్కుల్లో 15 శాతం వెయిటేజీ ఇచ్చి శిక్షణకు ఎంపిక చేసామని పేర్కొన్నారు. అభ్యర్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలలోపు ఉండాలని తెలిపారు. అభ్యర్థులు ఈనెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్టు ఈనెల 27న ఉంటుందని పేర్కొన్నారు.

టెట్‌కు 90 శాతం హాజరు

భీమవరం : జిల్లాలోని రెండు కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఏపీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షకు 90 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని డీఈఓ జి.నాగమణి తెలిపారు. భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో 182 మందికి 157 మంది, తాడేపల్లిగూడెం వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో 448 మందికి 409 మంది అభ్యర్థులు హాజరయ్యారని చెప్పారు.

ఏలూరులో 162 మంది..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లు ఏలూరులోని రెండు కేంద్రాల్లో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షలకు 185 మందికి 162 మంది హాజరయ్యారని జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

60 ప్రైవేట్ బస్సులపై కేసులు



ట్రావెల్స్ బస్సును తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

ఏలూరు (టూటౌన్) : జిల్లావ్యాప్తంగా రెండు రోజులుగా కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని, 60 బస్సులపై కేసులు నమోదు చేశామని ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం తెలిపారు. దసరా నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని, నిబంధనలకు విరుద్ధంగా సరుకు రవాణా చేస్తున్నట్టు, ప్రయాణికుల నుంచి ఎక్కువ మొత్తంలో చార్జీల వసూలు చేస్తున్నట్టు గుర్తించామన్నారు. అలాగే కొన్ని బస్సుల పర్మిట్ వైలేషన్ గుర్తించామన్నారు. మరో రెండు రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని చెప్పారు. వాహన తనిఖీల్లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొంటున్నారు.

అంబరం.. ఏనుగు సంబరం



పెనుగొండ : దసరా సందర్భంగా శనివారం రాత్రి పెనుగొండలో ఏనుగుల సంబరం అంబరాన్నంటింది. పెనుగొండ వేంద్రవారి పేట, మేకావారి వీధి, సాయిబాబా ఆలయం వద్ద అంబారీపై గ్రామోత్సవాన్ని నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి అవతారాలు, కనకదుర్గమ్మల గ్రామోత్సవాలు ఆకట్టుకున్నాయి.



ద్వారకాతిరుమలలో శ్రీవారిని పెండ్లి కుమారుడు, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేస్తున్న అర్చకులు



శ్రీ మహావిష్ణు అలంకారం

కమనీయం.. కడు రమణీయం

- చినవెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- శ్రీవారు, అమ్మవార్లకు పెండ్లి ముస్తాబు

శ్రీనివాసా.. గోవిందా.. శ్రీ వేంకటేశా.. గోవిందా.. స్మరణలు మార్మోగాయి. ద్వారకాతిరుమల చినవెంకన్న అశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీవారి నిత్య కల్యాణ మండపంలో స్వామివారిని పెండ్లి కుమారుడు, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేసే వేడుకను అట్టహాసంగా జరిపించారు. ముందుగా ఆలయ ఈఓ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి పట్టువస్త్రాలు, పూలు, పండ్లను సమర్పించారు. పెండ్లి ముస్తాబు తంతు అనంతరం అర్చకులు, పండితులకు ఈఓ మూర్తి, డీఈఓ బాబురావు, ఏఈఓ పి.నటరాజారావు నూతన వస్త్రాలను అందజేశారు. రాత్రి గజ వాహనంపై స్వామివారి పురవీధి సేవ నేత్రపర్వంగా సాగింది. అలాగే ఆలయ ముఖ మండపంలో ఉభయ దేవేరులతో స్వామివారు శ్రీ మహావిష్ణువు అలంకారంలో దర్శనమిచ్చారు. శ్రీహరి కళాతోరణ వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– ద్వారకాతిరుమల



గజ వాహనంపై శ్రీవారు

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 8 గంటల నుంచి భజన కార్యక్రమాలు
- ఉదయం 9 గంటల నుంచి భక్తిరంజని
- ఉదయం 10 గంటల నుంచి నామ సంకీర్తనలు
- సాయంత్రం 4 గంటల నుంచి నాదస్వర కచేరి
- సాయంత్రం 5 గంటల నుంచి కూచిపూడి భరత నాట్య ప్రదర్శనలు
- రాత్రి 7 గంటల నుంచి ధ్వజారోహణ
- రాత్రి 9 గంటల నుంచి హంస వాహనంపై తిరువీధి సేవ
- ప్రత్యేక అలంకారం : బక సంహారం

కూటమికి ఫుల్లు కిక్కు



ఇక మద్యం ఏరులు

- వైన్ షాపుల కేటాయింపునకు నేడు లాటరీ
- ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం
- భీమవరం, ఏలూరులో సర్వం సిద్ధం
- ఆక్షన్ హాళ్లలోనే బ్యాంక్ కౌంటర్లు
- 'పశ్చిమ'లో 175 షాపులకు 5,627 టెండర్లు
- ఏలూరులో 144 షాపులకు 5,499 దరఖాస్తులు

మద్యం ఏరులై పారనుంది.. లిక్కర్ షాపుల ప్రైవేటీకరణకు సర్వం సిద్ధమైంది.. ప్రజలకు కిక్కెక్కించేందుకు కూటమి సర్కారు ఏర్పాట్లు పూర్తి చేసింది.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రైవేట్ మద్యం దుకాణాల కేటాయింపునకు సోమవారం లాటరీ తీయనున్నారు. ఈ మేరకు భీమవరం, ఏలూరులో ఏర్పాట్లు పూర్తిచేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో 175 దుకాణాలకు 5,627 దరఖాస్తులు, ఏలూరు జిల్లాలో 144 షాపులకు 5,499 దరఖాస్తులు వచ్చాయి.



మద్యం షాపుల లాటరీ ప్రక్రియను నిర్వహించనున్న భీమవరంలో నిర్మలాదేవి ఫంక్షన్ హాల్

సాక్షి, భీమవరం : గతంలో విచ్చలవిడిగా సాగిన మద్యం అమ్మకాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టడి చేసింది. బెల్టుషాపులను అరికట్టి, నిర్ణీత వేళల్లో మాత్రమే మద్యం అమ్మకాలు జరిగేలా షాపులను ప్రభుత్వమే నిర్వహించింది. మద్యం దుకాణాల సంఖ్యను తగ్గించి గతంలో ఏరులై పారిన మద్యం అమ్మకాలకు తెరదించింది. అయితే మద్యం ద్వారా ఖజానా నింపుకునేందుకు కూటమి ప్రభుత్వం మరలా ప్రైవేట్ మద్యం పాలసీని తెరపైకి తెచ్చింది. రెండేళ్ల కాల పరిమితితో నూతన మద్యం పాలసీకి ఈనెల 1న నోటిఫికేషన్ ఇచ్చింది. జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజును రూ.50 లక్షల నుంచి రూ.65 లక్షలుగా నిర్ణయించింది. రూ.2 లక్షలు అప్లికేషన్ ఫీజుగా 1వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. దీనిలో భాగంగా మద్యం దుకాణాలకు లాటరీ తీసేందుకు భీమవరం పట్టణంలోని పెద అమీరంలోని నిర్మలాదేవి ఫంక్షన్ హాల్‌లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుంచి ప్రక్రియ మొదలుకానుంది. అలాగే ఏలూరు మినీ బైపాస్‌లోని చలసాని గార్డెన్స్‌లో లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రక్రియ ప్రారంభమవుతుంది.

సిండికేట్ల చేతుల్లోనే..

గత టీడీపీ హయాంలో పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, అత్తిలి తదితర ప్రాంతాల్లో బలంగా ఉన్న మద్యం సిండికేట్లు ప్రధాన పాత్ర పోషించాయి. అధిక శాతం మంది దరఖాస్తుదారులు ఇప్పటికే సిండికేట్లతో జతకట్టేందుకు లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్నట్టు తెలుస్తోంది. వారి ఆధ్వర్యంలోనే దరఖాస్తులు ఎక్కువగా అందజేసినట్టు ప్రచారం ఉంది. చాలాచోట్ల ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులు సిండికేట్లు వెనకుండి తంతు నడిపించినట్టు సమాచారం.

పటిష్ట బందోబస్తు

దరఖాస్తుదారుల్లో షాపులు ఎవరికి దక్కనున్నాయో సోమవారం తేలనుంది. గెజిట్ నంబర్, సర్కిళ్ల వారీగా షాపులకు లాటరీ తీయనున్నారు. భీమవరంలోని ఫంక్షన్ హాలులో ఏడు వేల మంది కూర్చునే ఏర్పాట్లు చేశారు. మొత్తం నాలుగు హాళ్లకు గాను ఒక హాల్‌లో లాటరీ, మిగిలిన మూడు వెయిటింగ్ కోసం కేటాయించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. షాప్ వచ్చిన వారు లైసెన్సు ఫీజులో మొదటి కిస్తీకి సంబంధించి నగదు చెల్లింపు కోసం ఆక్షన్ హాల్ వద్ద బ్యాంక్ కౌంటర్ ఏర్పాటు చేస్తున్నారు.

వందల్లో షాపులు.. వేలల్లో దరఖాస్తులు

పశ్చిమగోదావరి జిల్లాలో 175 మద్యం దుకాణాలకు గాను ఐదు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీ పరిధిలో 61 షాపులకు, 410 పంచాయతీల్లో 114 షాపులకు దరఖాస్తుల స్వీకరించారు. ఈనెల 11న రాత్రితో దరఖాస్తుల స్వీకరణ ముగిసేసరికి మొత్తం 5,627 దరఖాస్తులు అందాయి. భీమవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 40 షాపులకు 1,287 దరఖాస్తులు రాగా తణుకు ఎక్సైజ్ స్టేషన్‌లోని 33 షాపులకు 877, తాడేపల్లిగూడెం స్టేషన్‌లోని 36 షాపులకు 1,224, పాలకొల్లు స్టేషన్‌లోని 19 షాపులకు 873, నరసాపురం స్టేషన్‌లోని 24 షాపులకు 958, ఆకివీడు స్టేషన్‌లోని 23 దుకాణాలకు 408 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా పాలకొల్లు స్టేషన్ పరిధిలో దరఖాస్తులు రాగా ఆకివీడు స్టేషన్ పరిధిలో అతి తక్కువగా దరఖాస్తులు వచ్చాయి. అలాగే ఏలూరు జిల్లాలో 144 షాపులకు 5,499 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే సిండికేట్ ఒప్పందాలు నేపథ్యంలో లాటరీలో షాపులు చాలావరకు తమకే వస్తాయని సిండికేట్లు భావిస్తున్నాయి. ఒకవేళ బయట వారికి షాపులు దక్కినా అక్కడికక్కడే తమ సిండికేట్లలో వారిని కలుపుకునే ప్రయత్నాల్లో సిండికేట్ పెద్దలు ఉన్నారు.

పారదర్శకంగా ఏర్పాట్లు : కలెక్టర్

మద్యం షాపుల కేటాయింపు కోసం పారదర్శకంగా లాటరీ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదివారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు లేదా గుర్తింపు పొందిన (ఆథరైజ్డ్) వ్యక్తులు నిర్దేశిత సమయానికి తప్పకుండా హాజరుకావాలన్నారు. దరఖాస్తుదారుడు దరఖాస్తు ఫారం, ఎంట్రీ లేదా గేట్ పాస్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఒకవేళ దరఖాస్తుదారుడు హాజరు కాని పక్షంలో వారి తరఫున హాజరయ్యే వ్యక్తి ఆథరైజ్డ్ ఫారంతో పాటు పాన్, ఆధార్, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్, రేషన్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్సులలో ఏదైనా వెంట తీసుకురావాలని కలెక్టర్ నాగరాణి సూచించారు.

14 నుంచి పంచాయతీ వారోత్సవాలు

కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్) : జిల్లాలో ఈనెల 14 నుంచి 20 వరకు పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాలను అధికారుల సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో 423 పనులను రూ.51.03 కోట్ల వ్యయంతో చేపట్టనున్నామని, వీటిలో 351 సీసీ రోడ్లకు రూ.41.94 కోట్లు, 5 బీటీ రోడ్లకు రూ.2.46 కోట్లు, 67 సీసీ డ్రెయిన్లకు రూ.6.63 కోట్లు వెచ్చించనున్నామని చెప్పారు. ప్రతి పంచాయతీ పరిధిలో ఈ ఏడాదిలో చేసే అభివృద్ధి పనులకు సంబంధించి బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను పూర్తి చేయాలని, అలాగే పంచాయతీ వారోత్సవాల నిర్వహణపై గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. భూమి పూజ కోసం ప్రతిపాదించి మంజూరు చేసిన పనులు, గ్రామపంచాయతీ కార్యదర్శుల ద్వారా పీఆర్ వన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

పాపికొండల విహార యాత్ర ప్రారంభం



బుట్టాయగూడెం: పాపికొండల విహార యాత్ర దసరా పండుగ నుంచి మళ్లీ మొదలయ్యింది. భారీ వర్షాలు, వరదల కారణంగా ఐదు నెలలుగా నిలిచిన యాత్రను తిరిగి ప్రారంభించేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు. వరదలు తగ్గుముఖం పట్టడంతో పాపికొండల విహార యాత్రలకు బోట్లు నడిపేందుకు అనుమతులు ఇవ్వాలని టూరిజం యూనియన్ నాయకులు అధికారులను కోరారు. వాతావరణ పరిస్థితులు బాగుండటంతో యాత్రకు అనుమతులిచ్చినట్టు అధికారులు తెలిపారు.

● తెప్పోత్సవ శోభ



దువ్వలో దానేశ్వరి అమ్మవారి తెప్పోత్సవం

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. శనివారం విజయదశమిని పురస్కరించుకుని తణుకు మండలం దువ్వ గ్రామంలో దానేశ్వరి అమ్మవారిని రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించారు. రాత్రి దువ్వలోని వయ్యేరు కాలువలో అమ్మవారి తెప్పోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. - తణుకు టౌన్

నేడు విజయ శంకర స్వామీజీ రాక

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రాన్ని తిరుమల తిరుపతి అన్నమయ్య జానపద కళాక్షేత్రం పీఠాధిపతులు శ్రీశ్రీ విజయ శంకర స్వామీజీ సోమవారం సందర్శిస్తారని సకల కళాకారుల సంఘం మండల అధ్యక్షుడు సాయన సహదేవ రాజు తెలిపారు. భజన కోలాట జానపద కళాకారులకు రోజుకు మూడుసార్లు ప్రోగ్రామ్స్ నిర్వహించే అవకాశం ఇవ్వాలని, వారికి చార్జీలు ఇచ్చి దర్శన భాగ్యం కల్పించాలని, గురువులకు భుక్తి కల్పించాలని కోరుతూ ఆయన తెలుగు రాష్ట్రాల్లోని ఆలయాలను సందర్శిస్తున్నట్టు చెప్పారు. స్వామీజీ శ్రీవారి సన్నిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అన్నమయ్య గీతాలాపనలు, భక్తిపాటలు కోలాట ప్రదర్శనలు నిర్వహిస్తారన్నారు.

పెళ్లికి బాజా మోగింది

- వివాహాది శుభకార్యాలకు ముహూర్తాలు
- మొదలుకానున్న పెళ్లిళ్ల సీజన్
- కల్యాణ మండపాలకు డిమాండ్

కొయ్యలగూడెం/వీరవాసరం : వివాహాది శుభకార్యాలకు మంచి ముహూర్తాలు ఉండటంతో పెళ్లిళ్ల సీజన్ మళ్లీ మొదలైంది. ఆశ్వయుజ మాసం అక్టోబర్ 13 మొదలు కార్తీక, మార్గశిర మాసాలైన నవంబర్, డిసెంబర్‌లలో మంచి లగ్గాలు ఉండటంతో వివాహాది వేడుకలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్టోబర్‌లో నాలుగు, నవంబర్‌లో 17, డిసెంబర్‌లో 12 మంచి ముహూర్తాలు ఉన్నట్టు పండితులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. అలాగే ఈవెంట్ మేనేజర్లు, కేటరింగ్, లైటింగ్, షామియానా, అలంకరణ కార్మికులకు ముందస్తు బుకింగ్‌లు జరిగాయి. మతాంతర వివాహాలు చేసుకునేవారు, అలాగే భారతీయ సంప్రదాయాలను గౌరవించే ఇతర మతస్తులు సైతం అదే ముహూర్తాల్లో తమ మతాచారాల ప్రకారం చర్చిలు, మసీదుల్లో వివాహాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కల్యాణ మండపాలతో పాటు షాదీఖానాలు, చర్చిల ఆధ్వర్యంలోని మ్యారేజ్ హాళ్ల బుకింగ్‌లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ మూడు నెలల్లో వేలాది వివాహాలు జరుగనున్నట్టు అంచనా.



శుభ ముహూర్తాలు

అక్టోబర్	13, 16, 20, 27
నవంబర్	3, 7, 8, 9, 10, 12, 13, 14, 16, 17, 18, 22, 23, 25, 26, 28, 29
డిసెంబర్	4, 5, 6, 7, 8, 9, 11, 12, 14, 15, 16, 26

మండపాలకు గిరాకీ

ఇళ్ల వద్ద వివాహాలకు అనుకూలంగా ఉండకపోవటంతో చాలామంది కల్యాణ మండపాలవైపు చూస్తున్నారు. దీంతో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా కల్యాణ మండపాలన్నీ మూడు నెలలకు ముందుగానే బుక్ అయిపోయాయని కల్యాణ మండపం నిర్వాహకులు చెబుతున్నారు.

మార్గశిర మాసం వరకు..



ఆశ్వయుజ మాసం నుంచి మార్గశిర మాసం వరకు ముహూర్తాలు ప్రధానమైనవిగా పంచాంగాలు చెబుతున్నాయి. మార్గశిర మాసం అనంతరం నెల రోజుల పాటు మూఢం ఉంది.

– చావల శివకుమార్‌శర్మ, పురోహితుడు, కొయ్యలగూడెం

వివాహాలకు అనుకూలం



నవంబర్, డిసెంబర్‌లలో చాలా మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలలు శూన్య మాసం, భాద్రపద మాసం కావడంతో వివాహాది శుభకార్యాలకు ముహూర్తాలు లేవు. డిసెంబర్ చివరి వరకు వివాహాలకు అనుకూలమైన ముహూర్తాలు ఉన్నాయి.

– జోగారావు, జ్యోతిష్య పండితుడు

క్లుప్తంగా

జగనన్న గ్రీన్ విలేజ్ ఆర్చ్‌లో పేరు తొలగింపు



కైకలూరు వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో జగనన్న పేరును తొలగించిన దృశ్యం

కైకలూరు: వైఎస్సార్‌సీపీ పాలనలో నియోజకవర్గంలో తలమానికంగా పేరుపొందిన కైకలూరు వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్ ప్రారంభ స్వాగత ఆర్చిలో పేర్లను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం తొలగించారు. గత ప్రభుత్వంలో 96 ఎకరాల్లో వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌ను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ 375 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలను కేటాయించారు. జగనన్న గ్రీన్ విలేజ్‌కు రెండు ముఖ ద్వారాలు ఏర్పాటు చేశారు. ఒక ముఖద్వారానికి ఉన్న వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో జగనన్న పేరును గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. ఈ విషయమై కైకలూరు హౌసింగ్ ఏఈ శేఖర్‌ను వివరణ కోరగా సిబ్బంది ఫొటోలను మాత్రం తొలగించిందని, జగనన్న పేరు తొలగించడంపై విచారణ చేస్తానని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



అన్నంనీడి రమేష్

తాడేపల్లిగూడెం రూరల్: విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన తాడేపల్లిగూడెం మండలం ముత్యాలంబాపురంలో చోటు చేసుకుంది. ముత్యాలంబాపురంలోని శ్రీముత్యాలమ్మ దేవస్థానానికి కూతవేటు దూరంలో అన్నంనీడి రమేష్ (32) షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం స్నానం చేసి తడి బట్టలతో షాపులోకి వెళ్లగా విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయాడు. విషయాన్ని గుర్తించిన స్థానికులు ఆసుపత్రికి తరలించగా, మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు దేవస్థానం మాజీ చైర్మన్ అన్నంనీడి శ్రీనివాస్ కుమారుడు. ఉత్సవాలు ముగింపు రోజు ఇటువంటి సంఘటన జరగడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అమ్మవారి గ్రామోత్సవాన్ని నిలుపుదల చేసి, ఉత్సవ విగ్రహాన్ని కాలువలో నిమజ్జనం చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం సమీపంలో ఈ నెల 6న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు శుక్రవారం రాత్రి మరణించాడు. ప్రమాదంలో వణుదుర్రుకు చెందిన మహిళ సంఘటనా స్థలంలోనే మరణించగా పుప్పాల సుబ్రహ్మణ్యం(25) తీవ్రంగా గాయపడి విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేసినట్లు ఎస్సై డి.వెంకట కుమార్ తెలిపారు.



ద్వారకాతిరుమలలో రథంలో కొలువైన కుంకుళ్లమ్మ



నూజివీడులో హంసవాహనంపై ఊరేగుతున్న మహిషమ్మ అమ్మవారు



శ్రీరాజరాజేశ్వరి అలంకరణలో మావుళ్లమ్మ

దసరా వైభవం

- రాజరాజేశ్వరిగా అమ్మవారి దర్శనం
- ఉమ్మడి జిల్లాలో కిక్కిరిసిన ఆలయాలు
- చిత్రవిచిత్ర వేషధారణల నడుమ అమ్మవారి ఊరేగింపు

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి దివ్య రథోత్సవం శనివారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని రథోత్సవాన్ని శ్రీవారి దేవస్థానం అట్టహాసంగా నిర్వహించింది. ముందుగా ఆలయం వద్ద రథ వాహనాన్ని విశేష పుష్పమాలికలు, విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయం నుంచి అట్టహాసంగా తీసుకొచ్చి రథ వాహనంలో వేంచేపు చేశారు. ఆ తరువాత అర్చకులు, పండితులు అమ్మవారికి విశేష పుష్పాలంకారాలు చేసి, పూజాదికాలు జరిపారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కేరళ డప్పు వాయిద్యాలు, చిత్రవిచిత్ర వేషధారణలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి రథ క్షేత్ర పురవీధులకు పయనమైంది.

నూజివీడులో..

నూజివీడు: శ్రీ రాజరాజేశ్వరి అలంకరణలో నూజివీడు శ్రీ కోట మహిషాసురమర్దని అమ్మవారు దసరా రోజున దర్శనమిచ్చారు. చిత్రవిచిత్ర వేషధారణలు, కోలాట నృత్య ప్రదర్శనలు, బుట్టబొమ్మల సందడి నడుమ పురవీధుల్లో మహిషమ్మ అమ్మవారి ఊరేగింపు కొనసాగింది. హంసవాహనంపై ఊరేగుతూ వచ్చిన మహిషమ్మను పట్టణ ప్రజలు కనులారా దర్శించుకున్నారు. స్థానిక ఉయ్యూరు ఎస్టేట్‌లో జమిందారీ వారసులైన మేకా మెహర్‌రామ్ వెంకటాద్రి అప్పారావు తొలుత ఆయుధపూజ నిర్వహించి ఆ తరువాత జమ్మికొట్టి తుపాకీ పేల్చి దసరా ఉత్సవాలను ప్రారంభించారు. అక్కడ నుంచి ప్రారంభమైన ఊరేగింపు కోట మహిషాసురమర్దని ఆలయం వద్దకు చేరుకుని, అక్కడి నుంచి పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా తెల్లవార్లూ సాగింది. పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు.

మావుళ్లమ్మ ఆలయంలో

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో 10వ రోజు అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ ఉదయం దసరా ప్రత్యేక పూజ, లక్ష కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు.



నూజివీడులో బుట్టబొమ్మల సందడి



ద్వారకాతిరుమలలో కాంతార వేషధారణలు

వేడుకగా శ్రీవారికి శమీపూజ



ద్వారకాతిరుమలలోని దసరా మండపంలో శ్రీవారికి శమీపూజ నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో దసరా పండుగను పురస్కరించుకుని శనివారం రాత్రి చినవెంకన్నకు శమీపూజ ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రాజాధిరాజ వాహనంలో ఉంచి పూజాదికాలు జరిపారు. అనంతరం ఊరేగింపుగా తీసుకొచ్చి, చెరువు వీధిలో ప్రత్యేకంగా అలంకరించిన దసరా మండపంలో ఉభయ దేవేరులతో శ్రీవారిని వేంచేపు చేశారు. ఆ తరువాత అర్చకులు, పండితులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. మండప ఆవరణలోని జమ్మిచెట్టుకు పూజలు జరిపి, హారతులిచ్చారు.

భవానీ భక్తులకు రేడియం స్టిక్కర్లు



కలపర్రు టోల్ ప్లాజా వద్ద అల్పాహారం, మజ్జిగ అందించిన ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్

పెదపాడు: విజయవాడకు వెళ్లే భవాని భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణించాలని ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ సూచించారు. పెదపాడు మండలంలోని కలపర్రు టోల్‌ప్లాజా వద్ద దసరా ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడకు వెళ్తున్న భవానీ భక్తులకు అల్పాహారం, మజ్జిగ, బిస్కట్ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఎస్పీ కే ప్రతాప్ శివ కిశోర్ అందించారు. ఈ సందర్భంగా వారికీ రేడియం సిక్కర్లు అందించారు. భవాని భక్తులు రోడ్డు పక్కగా సర్వీసు రహదారి వెంట ప్రయాణించాలని సూచించారు.

రఘురామను కాపాడే ప్రయత్నం విరమించాలి



సమావేశంలో మాల సంఘాల నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించేసిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాను ఏపీ ప్రభుత్వం కాపాడే ప్రయత్నం చేయడాన్ని విరమించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు హెచ్చరించారు. పట్టణంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో మాల సంఘాల జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి ఎమ్మెల్యే గతంలో ఎంపీగా ఉన్న సమయంలో కూడా దళితులపై, క్రైస్తవంపై విషం చిమ్మారన్నారు. కూటమి ప్రభుత్వం రఘురామను అన్ని రకాలుగా కాపాడుతోందని విమర్శించారు.

● 10 అడుగుల వంగ



కామవరపుకోట కొత్తూరు మసీదు సమీపంలో వంగ మొక్క 10 అడుగులు పైగా పెరిగింది. ఎలాంటి ఎరువు వేయకుండా 18 నెలల నుంచి గుత్తులుగా కాయలు కాస్తూ ఆశ్చర్యపరుస్తుంది. ఉస్సే సంధ్య ఇంటి ఆవరణలో ఈ మొక్క కనిపించింది.

– కామవరపుకోట

ప్రాణాలకు తెగించి.. ఆపద్బాంధవుడై

కాల్వలో మునిగిపోతున్న తండ్రి, కూతురును రక్షించిన యువకుడు





ఇద్దరి ప్రాణాలు కాపాడిన మెర్ల సాయిబాబు, కాలువ నుంచి కారును బయటకు తీస్తున్న దృశ్యం

తణుకు: కళ్లెదుటే ప్రమాదం.. రెండు నిండు ప్రాణాలు పోతున్నాయి. ఇంతలో ఒక యువకుడు సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నాడు. తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా తండ్రీకూతుళ్లను కాపాడారు. తణుకు పట్టణానికి చెందిన దాసరి రాంబాబు ఒక ప్రైవేటు ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నారు. రాంబాబుకు ఇద్దరు కుమార్తెలు కాగా రెండో కుమార్తె మౌనికదేవి చెన్నైలో ఉద్యోగం చేస్తూ ఇటీవల సెలవులకు స్వగ్రామం వచ్చింది. శనివారం రాంబాబు, మౌనిక కారులో మండపాక యల్లారమ్మ దేవాలయానికి బయల్దేరారు. వెంకట్రాయపురం ఆంధ్రాసుగర్స్ ఎదురుగా వచ్చేసరికి కారు అదుపు తప్పి గోస్తనీ కాల్వలోకి దూసుకెళ్లింది. ఇదే సమయంలో అటుగా వెళుతున్న పలువురు వాహనదారులు ఆగి ఆ దృశ్యాన్ని చూస్తుండగా మరికొందరు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తున్నారు. ఒక పక్క కాల్వలో కారు మునిగిపోతుండగా కారులో ఉన్న రాంబాబు, మౌనిక కాపాడాలంటూ హాహాకారాలు చేస్తున్నారు. వడిఘబూ ప్రవహిస్తున్న కాల్వలోకి దిగేందుకు ఎవరూ సాహసించలేదు. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న పెరవలి మండలం నల్లాకులవారిపాలెంకు చెందిన మెర్ల సాయిబాబు తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా రెప్పపాటులో కాల్వలోకి దూకేశాడు. వారిని వెలికి తీసే ప్రయత్నంలో ఉండగా రోడ్డుపై ఉన్న మరో వ్యక్తి అతనికి సుత్తి అందించారు. సుత్తితో కారు అద్దాలు పగలగొట్టిన సాయిబాబు ఇద్దరిని ప్రాణాలతో ఒడ్డుకు చేర్చారు.

ఈత రాకపోయినా..

కారులో ఇద్దరు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న దృశ్యం అతన్ని కలచివేసింది. తనకు ఈత రాదనే విషయం మర్చిపోయిన సాయిబాబు తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కాల్వలోకి దూకిన వైనం స్థానికులను అబ్బురపరచింది. తమను కాపాడేందుకు సాక్షాత్తూ దుర్గమ్మ తల్లి రాంబాబు రూపంలో దిగి వచ్చిందని కన్నీళ్లతో తండ్రి రాంబాబు, కూతురు మౌనిక చెబుతున్నారు. సాహసోపేతంగా తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఇద్దరిని కాపాడిన మెర్ల సాయిబాబును ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం



గోదావరిలో యువతిని రక్షిస్తున్న స్థానికులు

పెనుగొండ: పెనుగొండ మండలం నడిపూడికి చెందిన వెన్నేటి రాజేశ్వరి(35) ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శనివారం కోనసీమ జిల్లా జొన్నాడ ఆలమూరు బ్రిడ్జిపై నుంచి గౌతమి నదిలోకి దూకేసింది. గమనించిన స్థానికులు, జాలర్లు హుటాహుటిన పడవపై వెళ్లి రక్షించారు. రాజేశ్వరిని గట్టుకు చేర్చి సపర్యలు చేశారు. అనంతరం బంధువులు రావులపాలెంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. కుటుంబ కలహాలు ఆత్మహత్యా యత్నానికి కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

పోలీసులమంటూ దందా

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం బీచ్ రోడ్‌లో పోలీసులమని చెప్పి డబ్బులు వసూలు చేసిన సంఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై జి.వాసు ఆదివారం తెలిపారు. భీమవరం మండలం రాయలంకకు చెందిన దవులూరి సువర్ణరాజు, దిరుసుమర్రు పెదపేటకు చెందిన వర్ధనపు ప్రసాద్, శ్రీరామపురానికి చెందిన మండా కిరణ్ కుమార్‌లను శనివారం అరెస్ట్ చేసి. న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

బుచ్చి అప్పారావు పేరును కొనసాగించాలి



మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్ : సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ గొర్రెపాటి బుచ్చి అప్పారావు పేరును తాడిపూడి జలాశయానికి పెట్టాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో బుచ్చి అప్పారావు పేరు పెట్టారని, ప్రస్తుత ప్రభుత్వం ఆ పేరును రద్దు చేస్తున్నట్లు జీఓను విడుదల చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం కళ్యాణ మండపంలో బుచ్చ అప్పారావు 111వ జయంతి కార్యక్రమాన్ని కూనిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో మహోన్నత వ్యక్తులకు సముచిత స్థానం కల్పించారన్నారు. గతంలో ఎన్టీఆర్ పేరు ఉన్న సంస్థలకు వైఎస్సార్ పేరు పెడితే ఉద్యమాలు చేసిన తెదేపా నాయకులు జగన్ అధికారంలో ఉన్న సమయంలో స్వతంత్ర సమరయోధులకు సముచితస్థానం కల్పిస్తే వారి పేరును తొలగించడాన్ని దుయ్యబట్టారు. బడుగు వెంకటేశ్వరరావు, తాతా శ్రీనివాస్, బొడ్డు సాయిబాబా, నగర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కర్నాటి కన్నయ్య, గొర్రెల శ్రీనివాస్, బొద్దాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాలధారణం.. నియమాల తోరణం



గురవాయిగూడెం అయ్యప్ప స్వామి దేవస్థానం



అన్నసమారాధన కార్యక్రమం

- గురవాయిగూడెంలో ఏటా ఇరుముడులు సమర్పిస్తున్న స్వాములు
- ఏకశిలపై పదునెట్టాంబడి(18 మెట్లు) క్షేత్రంలో ప్రత్యేకత
- దీక్ష పూర్తి చేసిన స్వాములకు పదునెట్టాంబడి ఎక్కే అవకాశం
- స్వాములకు ఉచిత అన్నప్రసాద కార్యక్రమం



జంగారెడ్డిగూడెం రూరల్: అయ్యప్ప స్వామి దీక్షలు ప్రారంభం కావడంతో ఎక్కడ చూసినా స్వాములతో క్షేత్రాలు కోలాహలంగా ఉన్నాయి. 41 రోజుల పాటు కఠిన నియమాలతో భక్తులు అయ్యప్ప దీక్షలు ఆచరిస్తుంటారు. కార్తీక మాసం నుంచి సంక్రాంతి వరకు దీక్షలు చేపట్టి ఇరుముడులు సమర్పిస్తుంటారు. దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో శబరిమలై అయ్యప్ప ఆలయం ఒకటి కావడంతో దీక్ష పూర్తి చేసిన భక్తులు అక్కడికి వెళ్లి ఇరుముడులు సమర్పిస్తుంటారు. అదే తరహాలో ఏలూరు జిల్లాలో ఆంధ్రా శబరిమలైగా విరాజిల్లుతున్న జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీఅయ్యప్పస్వామి దేవస్థానానికి దీక్ష పూర్తి చేసిన భక్తులు ఏటా వచ్చి ఇరుముడులు సమర్పిస్తుంటారు.

ఏకశిలపై 18 మెట్ల ప్రత్యేకత

గురవాయిగూడెం శ్రీ అయ్యప్పస్వామి క్షేత్రంలో ఏర్పాటు చేసిన 18 మెట్లు ప్రత్యేకంగా నిలుస్తాయి. ఏకశిలపై 18 మెట్లను శిల్ప కళాకారులతో చెక్కించి ఏర్పాటు చేశారు. 41 రోజులు దీక్షలు పూర్తి చేసిన స్వాములు మాత్రమే 18 మెట్ల మీద స్వామిని దర్శించుకునేందుకు వీలు కల్పిస్తారు. సాధారణ భక్తులు 18 మెట్లకు పక్కగా నిర్మించిన వేరే మెట్ల నుంచి స్వామిని దర్శించుకోవచ్చు.

ఉచిత అన్నదానం ప్రారంభం

భక్తులకు క్షేత్రంలో అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాట్లు చేసింది. స్వాములు ఆలయంలో పీఠాలను ఏర్పాటు చేసుకుని పూజలు చేసుకుంటూ అక్కడే బస చేసేలా ఏర్పాట్లు చేశారు. 50 రోజుల పాటు అయ్యప్ప స్వాములతో పాటు, భవానీ, శివ, వేంకటేశ్వరస్వామి మాలలను ధరించిన భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దసరా పర్వదినాన అన్నదానం ప్రారంభించారు.

ఆలయ దర్శన వేళలు

ఉదయం 5:30 గంటలకు తెరిచి మధ్యాహ్నం 12 గంటల వరకు దర్శనం కల్పిస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు తెరిచి రాత్రి 8 గంటల వరకు స్వామి వారి దర్శనాన్ని కల్పిస్తారు.

పదునెట్టాంబడి క్షేత్ర ప్రత్యేకత



గురవాయిగూడెం అయ్యప్ప స్వామి దేవస్థానికి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా స్వాములు క్షేత్రానికి వస్తుంటారు. ఈ క్షేత్రంలో ఏకశిలపై పదునెట్టాంబడి ఉండటంతో ఈ క్షేత్రానికి ఒక ప్రత్యేకత.

-కేసరి రామిరెడ్డి, అయ్యప్ప ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్

స్వాములకు సదుపాయాలు



అయ్యప్ప దీక్షలు ఆచరించిన స్వాములకు ఆలయంలో 50 రోజుల పాటు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటాం. 14 సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నాం. దీక్ష చేపట్టే భక్తులకు సదుపాయాలు కల్పిస్తున్నాం. ఏటా అనేక ప్రాంతాల నుంచి భక్తులు గురవాయిగూడెం అయ్యప్ప క్షేత్రానికి వచ్చి ఇరుముడులు సమర్పిస్తుంటారు.

– గంగు జగన్మోహనరెడ్డి, అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

భక్తితో పాటు ఆరోగ్యం



స్వామి మాలలో ఉదయాన్నే నిద్రలేవడం చైతన్యానికి ప్రతీకగా, సూర్యోదయానికి ముందే చన్నీటి స్నానంతో నాడీ వ్యవస్థ ఉత్తేజపర్చడం, నేలమీద పడుకోవడం ద్వారా వెన్నునొప్పులకు పరిష్కారం, కండరాల పటిష్టత, రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగుపడేందుకు దోహదపడుతుంది. చెడు వ్యసనాలకు దూరంగా ఉండడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుంది.

-జొన్నలగడ్డ తేజ శర్మ, ఆలయ అర్చకులు

క్లుప్తంగా

రఘురామ్‌నాయుడును కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



తాడేపల్లిగూడెం పట్టణంలో వడ్డి రఘురామ్ నాయుడును కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్ : పట్టణంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురామ్ నాయుడును శనివారం సాయంత్రం మండలంలోని కడియద్ద గ్రామానికి చెందిన 50 మంది వైఎస్సార్‌సీపీ శ్రేణులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రఘురామ్ నాయుడు మాట్లాడుతూ పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు పని చేయాలన్నారు. ప్రజలకు అండగా నిలవాలన్నారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీటీసీ దారపురెడ్డి శ్రీనివాస్, ఉప సర్పంచ్ జాలపర్తి సంకిరయ్య, నాయకులు జాలపర్తి రామకృష్ణ, రమేష్, కంకిపాటి ఏసు, యాతం మణికృష్ణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీ టెట్ పరీక్షలు



ఎగ్జామ్ సెంటర్‌లో టెట్ అభ్యర్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గత రెండు వారాలుగా జరుగుతున్న ఏపీ టెట్ పరీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. శ్రీ వాసవిఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పరీక్షలు నిర్వహించారు. ఉదయం 227 మందికి గాను 209 మంది, సాయంత్రం 221మంది 200మంది పరీక్షలు రాశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు తెలిపారు. ఉదయం ముగ్గురు, సాయంత్రం ఒకరు స్క్రైబ్ సహాయంతో పరీక్షలురాశారని పేర్కొన్నారు. కోఆర్డినేటర్ నటరాజ్ సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్ పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు.

గోపికి వైఎస్సార్ సీపీ నాయకుల ఆర్థిక సాయం

పెంటపాడు: పెంటపాడుకు చెందిన ఉండ్రా వరపు గోపి ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై పలు ఆసుపత్రులలో చికిత్సలు పొందారు. కాగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న గోపిని పలువురు వైస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి రూ. 10 వేలు, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, ఏఎంసీ మాజీ వైఎస్ చైర్మన్ జామికృష్ణ, బర్ల జయరాంబాబు, బండారు రాంబాబులు కలిసి రూ. 20 వేలు గోపికి అందించారు. ఈ సందర్భంగా గోపికి ఆర్థికసాయం అందించడంపై కుటుంబసభ్యులతో పాటు, పలువురు ప్రముఖులు దాతలను ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ నాయకులు మారంపూడి ఏసుదాసు, చదలవాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వెండి కిరీటం సమర్పణ



అమ్మవారికి వెండి కిరీటాన్ని సమర్పిస్తున్న దాత కుటుంబం

అత్తిలి: స్థానిక రామన్నపేటలో వేంచేసియున్న శ్రీఐశ్వర్యదుర్గ అమ్మవారికి దాత సమర్పించిన వెండి కిరీటాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా సంప్రోక్షణ పూజలు చేశారు. గ్రామానికి చెందిన మరడాని దుర్గా బాలాజీ, దుర్గా భవాని దంపతులు అమ్మవారికి వెండి కిరీటాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ధర్మకర్త దాసరి నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



విద్యార్థులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు టౌన్: దాతలు అందించిన సహాయంతో విద్యార్థులు చదువులో ఉన్నతంగా రాణించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. ఆదివారం తణుకు రూరల్ మండలం వేల్పూరులోని శ్రీ విద్యానిధి వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా ఉన్నత చదువులు చదువుతున్న 15 మంది విద్యార్థులకు రూ.1.50 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేల్పూరు గ్రామ మాజీ సర్పంచ్ పెనుమర్తి వెంకట లక్ష్మీ ఆధ్వర్యంలో 2016లో ఏర్పాటు చేసిన ఈ ట్రస్ట్ ద్వారా ప్రతీ సంవత్సరం విద్యార్థులు ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెనుమర్తి వెంకటలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేట్ 'దసరా' బాదుడు !

- భారంగా తిరుగు ప్రయాణం
- టిక్కెట్ల కోసం ప్రయాణికుల వేట
- ఇష్టానుసారం వ్యవహరిస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్
- రద్దీగా రైళ్లు, ఆర్టీసీ బస్సులు



తణుకు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

తణుకు: పండగ సందడి ముగిసింది. వారం రోజుల పాటు ఎక్కడ చూసినా దసరా ముచ్చట్లే. ఎక్కడెక్కడి నుంచో సొంతూరికి వచ్చిన వారంతా ఇప్పుడు తిరుగుముఖం పట్టారు. పండగ ఇచ్చిన జోష్‌తో తిరిగి బయల్దేరిన వారికి బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు షాక్ ఇస్తున్నాయి. ఇసుకేస్తే రాలనంత జనం, ఇప్పటికే రిజర్వేషన్లు చేయించుకొని ఉన్న వారికి కాస్త పర్వాలేకపోయినా రిజర్వేషన్లు లేని వారికి మాత్రం అష్టకష్టాలు తప్పడం లేదు. బస్సు ఎక్కాలన్నా, రైలు ఎక్కాలన్నా ఎన్ని పాట్లు పడాలో చాలా మందికి తెలిసి వస్తోంది.

ప్రయాణం ఎలా..?

బెంగళూరు, హైదరాబాదు, విశాఖపట్టణం, ముంబయి, చెన్నై వంటి నగరాలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగరీత్యా స్థిర పడిన తణుకు పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు దసరా పురష్కరించుకొని సొంతూళ్లకు వచ్చారు. ప్రధాన నగరాల నుంచి వచ్చే రైళ్లు, బస్సుల ద్వారా చేరుకున్న వారంతా ఇప్పుడు తిరుగు ప్రయాణంపై దృష్టి సారించారు. అయితే జిల్లాలో ప్రధాన పట్టణాలైన ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, నరసాపురం, నిడదవోలు పట్టణాల మీదుగా సాధారణ రోజుల్లో సుమారు 25 వరకు ప్రధాన రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటితో పాటు మరో 600 వరకు ప్రైవేట్, ఆర్టీసీ బస్సులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తుంటాయి. వీటి ద్వారా జిల్లా నుంచి నిత్యం 20 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. పండుగ సమయాల్లో అయితే ఈ సంఖ్య నాలుగు రెట్లకు చేరుతుంది. ప్రస్తుతం హైదరాబాదు, ముంబయి, చెన్నై, బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో పరిస్థితి రద్దీగా మారడంతో కనీసం టిక్కెట్టు తీసుకునే స్థితి లేకుండా పోయింది. దీంతో తత్కాల్‌పై గంపెడాశలు పెట్టుకుంటున్నారు. మరో వైపు ఆర్టీసీ, ప్రైవేట్ ఆపరేటర్లు సైతం ఛార్జీలు పెంచేశారు.

మూడు రెట్లు అదనం

సొంతూళ్ల నుంచి తిరుగు ప్రయాణమవుతున్న వారంతా ఇప్పుడు రైళ్లు, బస్సుల్లో టిక్కెట్లు కోసం అన్వేషణ ప్రారంభించారు. దాదాపు రైళ్లన్నీ నిండుకోవడంతో ప్రైవేటు బస్సు ఆపరేటర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కొందరు బస్సు ఆపరేటర్లు టికెట్లు బ్లాక్ చేసి డిమాండ్ సృష్టిస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పండుగ పేరు చెప్పి ఆర్టీసీ సైతం ప్రయాణికులపై అదనపు భారం మోపేందుకు సిద్ధమైంది. ప్రైవేట్ ఆపరేటర్లు సైతం మూడు, నాలుగు రెట్లు అదనంగా బాదేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా నుంచి హైదరాబాదుకు ప్రైవేట్ ట్రావెల్స్ రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఇక్కడి నుంచి సుదూర ప్రాంతాలకు తిరుగు ప్రయాణమైన వారంతా ఇబ్బందులు పడుతున్నారు.

వృద్ధుడి ప్రాణం కాపాడిన ఎస్సై



ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు, చిత్రంలో రూరల్ ఎస్సై ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లి రూరల్ ఎస్సై జేఎస్‌వీ.ప్రసాద్ ఓ వృద్ధుడి ప్రాణాలను కాపాడారు. తాడేపల్లిగూడెం సమీపంలోని పెదవెల్లమిల్లి పొలాల్లో బీహార్‌కు చెందిన ఒక వృద్ధుడు మృతి చెంది ఉన్నాడన్న సమాచారం మేరకు ఆ ప్రాంతానికి ఎస్సై ప్రసాద్ చేరుకున్నారు. అయితే, ఆ వృద్ధుడు కొన ఊపిరితో ఉండటంతో అతనికి సపర్యలు చేసి, వెంటనే స్పందించి వృద్ధుడిని తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఆ వృద్ధుడు కోలుకుంటున్నాడు. వృద్ధుడు మాట్లాడలేని పరిస్థితిల్లో ఉండటంతో వివరాలు తెలుసుకోలేకపోయామని, ఆచూకి తెలిసిన వారు తాడేపల్లిగూడెం రూరల్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

వాసవీ మాతకు పూలంగి సేవ



వాసవీమాత ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో దసరా శరన్నవరాత్రులు సందర్భంగా ఆదివారం అమ్మవారికి ఫలరసాలతో, సుగంధద్రవ్యాలతో, పాలు, పెరుగు, నెయ్యి, పసుపు కుంకమ, గంధం, పన్నీరులతో 108 కలశాలతో అభిషేకాలు జరిగాయి. ఆలయ ఆవరణలో మహిళలతో కుంకుమ పూజలు చేయించారు. పుష్పాలతో పూలంగి సేవ, అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

వైభవంగా తెప్పోత్సవం

దసరా శరన్నవరాత్రులు సందర్భంగా స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రం వాసవి క్లబ్, ఆర్యవైశ్యులచే 1500 మంది ఆధ్వర్యంలో స్థానిక ఏలూరు గోదావరి కాలువలో పడవను ఏర్పాటు చేసి అమ్మవారికి తెప్పోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 11 ట్రిప్‌లు సాయి బాబా కల్యాణ మండపం నుంచి వంతెన వరకు నిర్వహించారు. తొలుత అమ్మవారికి పూజలు జరిపారు. ఏలూరు కాలువ గట్టులకు ఇరువైపుల భక్తులు హాజరై తెప్పోత్సవాన్ని తిలకించారు.

జట్లపాలెం రామాలయంలో కొట్టు ప్రత్యేక పూజలు

పెంటపాడు: నియోజకవర్గప్రజలకు తండ్రిమాట జవదాటని, ధర్మబద్ధంగా పరిపాలన చేసిన శ్రీరామ చంద్రుని ఆశీస్సులు మెండుగా ఉండాలని మాజీ ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. జట్లపాలెం గ్రామంలో యాదవ సంఘ ఆధ్వర్యంలో నూతనంగా ప్రతిష్ఠించిన రామాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, యాదవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

పెంటపాడు: దసరా నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పలు గ్రామాలలో అమ్మవార్లను ఘనంగా ఊరేగించారు. ప్రత్తిపాడు వై.జంక్షన్ దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్తిపాడు, కృష్ణాయపాలెం గ్రామాల్లో మేళతాళాలతో అమ్మవారిని ఊరేగించారు. ఆలయ ఈఓ శ్రీధర్ ఆధ్వర్యంలో అర్చకులు కొత్తలంక శివసత్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కాగులంపాడు కనకదుర్గమ్మకు శనివారం పాలాభిషేకం నిర్వహించారు. రాత్రి అమ్మవారిని ఆలయకమిటీ అధ్యక్షులు బడేటి ఉదయభాను ఆధ్వర్యంలో ఏలూరు కాల్వలో హంసవాహనంపై తెప్పోత్సవం నిర్వహించారు. దర్శిపర్రు పార్వతి బ్రహ్మలింగేశ్వర స్వామి వారి ఆలయంలో ధర్మకర్త బస్వాశ్యాం ఆధ్వర్యంలో ఊరేగించారు. కోడే కాళి, సర్పంచ్ కోలా శేషవేణి, ఉపసర్పంచ్ మార్కండేయులు పాల్గొన్నారు.

ఉచిత ధ్యాన శిక్షణ

వీరవాసరం: మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీసీతారామ స్వామి దేవస్థానం నందు ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ సున్న అరుణశ్రీ పాల్గొని జ్ఞానబోధ చేసి ధ్యాన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అరుణశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వర్తమానంలో జీవించడం అలవాటు చేసుకోవాలని దానికి శ్వాస మీద ధ్యాస ధ్యాన సాధన బాగా తోడ్పడుతుందని, కర్మ సిద్ధాంతాన్ని అవగాహన చేసుకొని వర్తమానంలో మంచి కర్మలు చేస్తూ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేడిశెట్టి ధృష్ణారావు, ముఖేష్, వర్రి విశ్వేశ్వరరావు టి.నాగరాజు బి.శ్రీదేవి, వర్రి కృష్ణవేణి, బి.యర్రాయమ్మ,ఆదిరెడ్డి గోపమ్మ, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు రఘురామ్ పరామర్శ



వైఎస్సార్ సీపీ నాయకులను పరామర్శిస్తున్న రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఉప్పర గూడెం గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ దాకే పండియ్య, దండగర్రకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పత్సా రాజులను రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురామ్‌నాయుడు పరామర్శించారు. అనారోగ్యం పాలై వారు కోలుకుంటున్నారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని రఘురామ్ నాయుడు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పి.శేషులత, కొప్పు వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. కాగా, వెంకట్రావుపాలెం గ్రామంలోని చర్చి నిర్మాణానికి రూ.లక్షను రఘురామ్‌నాయుడు విరాళంగా ప్రకటించారు.

31వ వార్డులో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ వర్కింగ్ అధ్యక్షుడు వడ్డి రఘురాం నాయుడు ఆదివారం పట్టణంలో 31వ వార్డులో అనారోగ్యంతో బాధపడుతూ కోలుకుంటున్న మాజీ కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ నాయకులు లంకా మోహన్‌బాబును, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి శీలి వెంకటేశ్వరరావులను పరామర్శించారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పి.శేషులత, కొప్పులవెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

లూథరన్ చర్చిలో ఘనంగా స్త్రీల ర్యాలీ



పెంటపాడు లూథరన్ చర్చిలో స్త్రీల ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న స్త్రీలు, సంఘ పెద్దలు

పెంటపాడు: సంఘంలో ప్రధానభాగమైన స్త్రీలు ఆధ్యాత్మిక నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని పెంటపాడు పారిష్ లూథరన్ చర్చి గురుమండల అధ్యక్షులు ఎన్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం పెంటపాడు, జట్లపాలెం, కె. పెంటపాడు, యానాలపల్లి, దర్శిపర్రు, రాచర్ల గ్రామాలకు చెందిన లూథరన్ చర్చిసంఘ స్త్రీల ర్యాలీ కార్యక్రమం ఉదయం నుంచి రాత్రి వరకు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీలకు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సంఘ కోశాధికారి శామ్యూల్‌రాజు, సీఆర్‌లు కృపాదానం, వై. సునీల్, టి. పాల్, ఆసఫ్‌రాజ్, సుధాకర్, కృష్టాఫర్, స్త్రీల సమాజ అధ్యక్షురాలు సునీత సునీల్ కుమార్, ఏలూరుకు చెందిన స్పీకర్ ఎం. స్వర్ణ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అమలు చేయాలని నిరసన



తోకతిప్పలో ఇచిత ఇసుక కోసం నిరసన తెలుపుతున్న దృశ్యం

భీమవరం: ఉచిత ఇసుక పాలసీని సక్రమంగా అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని తోకతిప్పలో ఆదివారం పీఎం ఆధ్వర్యంలో ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు ఉచిత ఇసుక పాలసీని అమలు చేసి భావన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పిస్తారని ఎంతో ఆశతో ఎదురు చూశారన్నారని అయితే అధికారం చేపట్టి నాలుగు నెలలు గడిచిపోతున్నా ఉచిత ఇసుక పాలసీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు బర్రె రమేష్, మోక మీరా సాహెబ్, సీపీఎం నాయకులు బొడ్డు లక్ష్మీపతి, తిరుమాని నాగేశ్వరావు, సూర్యనారాయణ, పొన్నమండ నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు బిక్ష ఏర్పాటు



అయ్యప్ప మాలధారులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల శ్రీఅయ్యప్ప స్వామివారి ఆలయంలో అయ్యప్ప మాలధారులకు అన్నప్రసాద వితరణ (బిక్ష) కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. నవంబరు 13 వరకు నెల రోజుల పాటు కొవ్వూరి గాంధీరెడ్డి, హేమ మిత్ర నర్సారెడ్డి జ్ఞాపకార్థం గాంధీ రెడ్డి సతీమణి అమ్మాజీ సహకారంతో బిక్ష ఏర్పాటు చేస్తున్నట్లు అయ్యప్ప సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మల బాబ్జీ, గ్రంధి సత్యనారాయణ తెలిపారు. నవంబరు 14 నుంచి జనవరి 14వ తేది వరకు దాతల సహకారంతో అన్నప్రసాద వినియోగం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి ద్వారంపూడి దేవరాజ్ రెడ్డి, ఉపాధ్యక్షులు వెన్నస్వామి, మాజీ ఉపాధ్యక్షుడు గర్నిపూడి సూరిబాబు, సభ్యులు నల్లమిల్లి గాంధీరెడ్డి, కాళ్ల త్రిమూర్తులు, ములగాల జితేంద్ర పాల్గొన్నారు.

రొయ్యల వ్యాపారి టోకరా కలకలం

భీమవరం: స్థానిక రొయ్యల వ్యాపారి టోకరా వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారిది. పెద్ద మొత్తంలో టోకరా వేసిన వ్యాపారి టీడీపీ నాయకుడు కావడంతో వ్యవహారాన్ని గుట్టుచప్పుడు కాకుండా చక్క బెట్టడానికి కొంతమంది టీడీపీ, జనసేన నాయకులు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. కొంత కాలం పాటు ఒక రొయ్యల కంపెనీలో పని చేసిన వ్యక్తి తరువాత టీడీపీ, జనసేన నాయకుల అండతో సొంతంగా రొయ్యల కొనుగోలు వ్యాపారం ప్రారంభించాడు. కొంత కాలం రైతులకు సక్రమంగా సొమ్ములు చెల్లించడంతో అతనిపై అందరిలోనూ నమ్మకం ఏర్పడింది. దీనిని అదునుగా తీసుకొని ప్రాన్ బ్రోకర్స్ వద్ద పెద్ద మొత్తంలో అప్పులు చేసి వారికి నమ్మకం కలిగించడానికి పేరొందిన రొయ్యల కంపెనీకి రొయ్యలు విక్రయించినట్లు నకిలీ రశీదులు సృష్టించి, ప్రాన్‌బ్రోకర్స్, రైతులకు చూపించడంతో పూర్తిగా నమ్మకం ఏర్పడి వారు పెద్ద మొత్తంలో అప్పులు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఈ విధంగా సుమారు 50 మంది నుంచి రూ.14 కోట్లకు పైగా అప్పు తీసుకున్నట్లు చెబుతున్నా ఇంకా పెద్ద మొత్తం ఉంటుందని అంచనా వేస్తున్నారు. టోకరా వేసిన వ్యక్తి వెనుక టీడీపీ, జనసేన నాయకులున్నట్లు తెలియడంతో ఏమి చేయాలో తెలియని సంకట పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా పేరొందిన కంపెనీ నలికే రశీదులు వినియోగించడంతో కంపెనీ ప్రతినిధి తమకు టోకరా వేసిన వ్యక్తికి ఎటువంటి సంబంధం లేదని తమ రశీదులను అక్రమంగా వినియోగించారంటూ ముందుస్తు జాగ్రత్తగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నారు. అయితే పోలీసులకు ఫిర్యాదు విషయం బయటపడకుండా టోకరా వేసిన వ్యక్తి వ్యవహారం సర్దు బాటు చేసుకుంటే ఎటువంటి కేసు పెట్టొద్దని, ప్రాన్‌బ్రోకర్స్, రైతులకు ఇవ్వాల్సిన సొమ్ములు ఇవ్వకుండా వారిని ఇబ్బంది పెడితే కేసు నమోదు చేమొచ్చని పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడవకుండానే టీడీపీ నాయకులపై పలు ఆరోపణలు రావడంతో జనసేన క్యాడర్ మండి పడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఒక టీడీపీ నాయకుడు మున్సిపల్ అనుమతులు లేకుండా అక్రమంగా భవనం నిర్మిస్తుంటే తాజాగా రొయ్యల వ్యాపారి గొడవ టీడీపీ పైనే కాకుండా జనసేన, బీజేపీపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని క్యాడర్ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా దానేశ్వరి అమ్మవారి తెప్పోత్సవం



శ్రీ రాజరాజేశ్వరి అవతారంలో తణుకులోని వాసవీ కన్యకా పరమేశ్వరి



శ్రీ రాజ రాజేశ్వరీదేవి అలంకరణలో మండపాక యల్లారమ్మ

ముగిసిన దసరా వేడుకలు



అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం మండలంలోని వివిధ దేవాలయాల్లో సోమవారం అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తణుకు మండలం దువ్వలో వేంచేసియున్న శ్రీ దానేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ఉదయం రాజరాజేశ్వరిగా అలంకరించారు. సాయంత్రం గ్రామంలోని దువ్వ వయ్యేరులో తెప్పోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ అడ్డాబాబు, ఆలయ కమిటీ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ, సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో వేంచేసియున్న శ్రీ యల్లారమ్మ వారి ఆలయంలో దసరా ఉత్సవాలు సందర్భంగా అమ్మవారిని శనివారం రాజరాజేశ్వరి అలంకరించారు. అనంతరం అమ్మవారిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆత్మకూరి రామకృష్ణ, ఆలయ ఈవో పి.సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. వేల్పూరులో శరన్నవ రాత్రి వేడుకల సందర్భంగా గ్రామ ఆర్యవైశ్య సేవా సంఘం భవన్‌లో శనివారం అమ్మవారిని శ్రీ రాజ రాజేశ్వరీదేవిగా అలంకరించి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తణుకు పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ప్రార్థనా మందిరంలో అమ్మవారిని శనివారం రాజరాజేశ్వరిగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. మండలంలోని పలు దేవాలయాల్లో పది రోజులుగా నిర్వహిస్తున్న దసరా వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆయా దేవాలయాల ఆధ్వర్యంలో అమ్మవారిని గ్రామాల్లో ఊరేగింపు ఉత్సవాలు నిర్వహించారు.

ఘనంగా గ్రామోత్సవాలు

అత్తిలి: మండలంలో శ్రీదేవిశరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. అత్తిలి ఐశ్వర్యదుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నెలకొల్పిన కనకదుర్గమ్మకు ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి ప్రతిమను వాహనంపై ఉంచి మేళతాళాల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు. అత్తిలి మండలం బల్లిపాడు గరువు ప్రాంతంలో నెలకొల్పిన అమ్మవారి ప్రతిమను ఊరేగింపు నిర్వహించి, నిమజ్జనం చేశారు. మండలంలో పలు గ్రామాల్లో మ్మవార్ల గ్రామోత్సవాలను వేడుకగా నిర్వహించారు.